క్లుప్తంగా

పోలేరమ్మకు సారె సమర్పణ



అల్లూరు: ఆషాడ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని అల్లూరుపేటలోని గ్రామదేవత పోలేరమ్మకు మహిళా భక్తులు సారెను సమర్పించారు. పెద్దకాపు మేడా వెంకటేశ్వరరెడ్డి ఇంటి నుంచి మహిళా భక్తులు మేళతాళాల నడుమ ఊరేగింపుగా సారెను తీసుకొచ్చి పోలేరమ్మకు సమర్పించారు. ఈ సందర్భంగా పోలేరమ్మకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. పోలేరమ్మ విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ మేడా రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

జలదంకి: డెంగీ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు జలదంకి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. కావలి సబ్ యూనిట్ అధికారి నరసయ్య మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమకాటు వల్ల వ్యాప్తి చెందుతుందని తెలిపారు. దోమల నివారణకు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు, ఆరోగ్యకార్యకర్త కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు సుజాత, మానస పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



బాలకృష్ణారెడ్డి(ఫైల్)

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం మడపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పూనూరు బాలకృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. గురువారం ఆయన ఓ పని నిమిత్తం నెల్లూరు వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఓ టీ స్టాల్ వద్ద ఆగి టీ తాగుతున్న సమయంలో ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కాగా మడపల్లిలోని స్వగృహంలో ఉంచిన బాలకృష్ణారెడ్డి పార్థీవదేహాన్ని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా మడపల్లిలో బాలకృష్ణారెడ్డి అంతిమ సంస్కారాలను శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



ఆత్మకూరు: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతుగా పారిశుధ్య కార్మికులు చేపడుతున్న సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ కార్మికుల యూనియన్ కార్మికులు సమ్మెను కొనసాగించారు. సీఐటీయూ, సీపీఎం, ఏపీ కూలీ సంఘం కార్మిక నాయకులు జీ శివప్రసాద్, కే డేవిడ్‌రాజు, యస్దానీ, హజరత్తయ్య, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 608 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 608 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 900 బేళ్లు రాగా, 608 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.185.25 ధర లభించిందని వివరించారు.

కిలో సగటు పొగాకు ధర రూ.200

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు సగటు ధర రూ.200.89 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు వేలానికి 634 బేళ్లను తీసుకురాగా, 535 బేళ్లను కొనుగోలు చేయగా, మిగిలిన బేళ్లను తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.200.89 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధానికి కృషి చేయాలి



అల్లూరు: సచివాలయాల పరిధిలోని ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు సూచించారు. మూడో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధానికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. డీడీఓ వరప్రసాద్ పాల్గొన్నారు.

నక్కలగండిపై నిర్లక్ష్యం.. ఆయకట్టుకు శాపం

- ప్రాజెక్ట్ కింద 1200 ఎకరాల ఆయకట్టు
- పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోని జలాశయం
- అధ్వానంగా పంట కాలువలు
- గత కొన్నేళ్లుగా ఆయకట్టుకు అందని సాగునీరు
- జీటలు వారి చిల్లచెట్లతో నిండిన భూములు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రెండు జిల్లాల అన్నదాతలు



అభివృద్ధికి నోచుకోని నక్కలగండి ప్రాజెక్టు



అధ్వానంగా పంట కాలువ

ఉదయగిరి: నెల్లూరు–ప్రకాశం జిల్లాల సరిహద్దులో ఉన్న నక్కలగండి జలాశయం అభివృద్ధిపై పాలకులు, అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. సుమారు 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్ట్ కింద సుమారు 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. రెండు జిల్లాలకు చెందిన రైతుల పాలిట వరప్రదాయినిగా ఉన్న ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. సాగునీటి కాలువలు అధ్వానంగా ఉండడంతో ప్రాజెక్టులో నీరున్నా పంట పొలాలకు చేరడం గగనంగా మారింది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ప్రధానమైన గండిపాళెం ప్రాజెక్ట్ ద్వారా వరికుంటపాడు మండలంలోని పడమర ప్రాంతం భూములకు సాగునీరు అందుతుంది. కానీ తూర్పుప్రాంత రైతులకు నక్కలగండి ప్రాజెక్ట్ మాత్రమే దిక్కు. అయితే పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోక గత కొన్నేళ్లుగా ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదు. దీంతో బంగారం వంటి భూములు బీటలు వారి చిల్లచెట్లతో అడవిని తలపిస్తున్నాయి.

గతమెంతో ఘనం

నక్కలగండి ప్రాజెక్టు పరిధిలో 1200 ఎకరాలు ఆయకట్టు ఉంది. వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి, వేంపాడు, రామాపురం, టీ కొండారెడ్డిపల్లి, డక్కునూరు పంచాయతీల పరిధిలో వేయి ఎకరాలు ఆయుకట్టు ఉంది. ప్రకాశం జిల్లా పామూరు మండలం కోడిగుడ్లపాడు పంచాయతీలో మరో 200 ఎకరాలు ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. 1990 వరకు ప్రాజెక్ట్‌లో పుష్కలంగా నీరు చేరుతూ ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా ఉండేవి. రైతుల ఇళ్లు ధాన్యంతో కళకళలాడుతూ వారు సంతోషంగా ఉండేవారు. కానీ ఆ తర్వాత కరువు పరిస్థితులతో ప్రాజెక్టులోకి నీరు చేరకపోవడం..ప్రాజెక్ట్ నిర్వహణకు తగిన నిధులు రాకపోవడంతో కొంత నిరాదరణకు గురైంది. దీంతో చాలా మంది రైతులు తమ పొలాలను బీళ్లుగా వదిలేసి ఉపాధి కోసం పొరుగు ప్రాంతాలకు వలస వెళ్లారు.

గత ప్రభుత్వంలో నిధులు కేటాయించినా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రాజెక్ట్, కాలువల అభివృద్ధి కోసం ప్రపంచ బ్యాంకు నిధులు రూ.3.41 కోట్లు మంజూరయ్యాయి. దీంతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. కొంతమేర కాలువ పనులు చేశారు. ఆ తర్వాత కాంట్రాక్టర్ పనులు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీంతో మరో రూ.కోటి పనులు ఆగిపోయాయి. కాలువల అభివృద్ధి పనులు అటకెక్కాయి. దీంతో కాలువలు కంపచెట్లతో మూసుకుపోయి సాగునీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. అదే విధంగా ప్రాజెక్టు కట్టపైన దండిగా చెట్లు పెరిగాయి. ప్రాజెక్టు తూములు సైతం కొంతమేర మరమ్మతులకు గురికావడంతో లీకేజీ ద్వారా సాగునీరు వృథా అవుతోంది. ప్రస్తుతం వర్షకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రాజెక్ట్‌పై పాలకులు, అధికారులు దృష్టి సారిస్తే వచ్చే రబీ సీజన్‌లో కొంతమేర ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉంటుంది.

త్వరలో కాలువల పనులు



గత ప్రభుత్వంలో ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. అందులో రూ.90 లక్షలతో పనులు చేపట్టాల్సి ఉన్నా కాంట్రాక్టర్ చేయలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరో మూడు నెలల్లో కాంట్రాక్టు రద్దవుతుంది. ఆ తర్వాత కొత్తగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. త్వరలో ప్రాజెక్టు వద్ద ఉన్న చిల్లకర వేలం వేసి వచ్చిన నిధులతో కాలువల్లో చెట్లు తొలగిస్తాం.వచ్చే రబీ సీజన్‌లో ఆయకట్టుకు నీరు అందేలా కృషి చేస్తాం.

– ఆది రమేష్, ఏఈ, ఇరిగేషన్

శాకాంబరిగా సంతానలక్ష్మి



ఉదయగిరి రూరల్: ఆషాడ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని ఉదయగిరి పట్టణంతో పాటు మండలంలోని ఆలయాల్లో శుక్రవారం అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివాలయంలో పార్వతీదేవికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. అలాగే బీసీకాలనీ సమీపంలోని సంతానలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అర్చకులు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు శాకాంబరిదేవిగా దర్శనమిచ్చారు.

వైభవంగా మండల పూజలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని జీబీకేఆర్ గిరిజన కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ట జరిగి నలభై రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మండల పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నవీన్ స్వామి ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణదాత జూపల్లి రాజారావు, భక్తులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఉదయగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని బీసీకాలనీ ఉర్దూ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతో పాటు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. అప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించడంతో పాటు తల్లిదండ్రుల కలలను సాకారం చేయవచ్చునన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మనబడి మన భవిష్యత్ పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. పాఠశాల అభివృద్ధికి ఏ వనరులు అవసరమవుతాయో తన దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం నూర్జహాన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

కావలి(జలదంకి): జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడింది. ఈ ఘటన కావలి మండలం గౌరవరం సమీపంలో శుక్రవారం వేకువన చోటు చేసుకుంది. వివరాలు.. కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామానికి చెందిన కందిపాటి శేషమ్మ (84) ఒంగోలులో జరిగే బంధువు ఉత్తరక్రియలకు వెళ్లేందుకు శుక్రవారం వేకువన ఇంటి వద్ద నుంచి బయలుదేరింది. గౌరవరం టోల్‌ప్లాజా వద్దకు వెళితే కావలికి ఏదైనా వాహనం దొరుకుతుందని, అక్కడి నుంచి ఒంగోలుకు త్వరగా వెళ్లవచ్చని భావించింది. ఇంటి నుంచి టోల్‌ప్లాజా వద్దకు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా సాంబశివపురం క్రాస్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో శేషమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. శేషమ్మ భర్త 30 ఏళ్ల కిత్రం మరణించారు. ఆమెకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ నీరు తాగేదెలా?



పాచి పట్టి ఉన్న బావిలోని నీరు

దగదర్తి : మండలంలోని ఊచగుంట పాళెం పంచాయతీలో తాగునీటికి ప్రధాన ఆధారమైన బావిలోని నీరు పాచిపట్టి అపరిశుభ్రంగా ఉండడంతో ఎలా తాగాలని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి బావిలోని నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తారు. బావిలోని నీటిని నెలకు రెండుసార్లు క్లోరినేషన్ చేయాల్సి ఉన్నా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కారణంగా బావిలోని నీరు పాచిపట్టి అపరిశుభ్రంగా మారాయి. ఈ నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేస్తుండడంతో తాగి రోగాలతో ఆస్పత్రుల పాలవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి బావిలో క్లోరినేషన్ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

దగదర్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని సిద్దారెడ్డిపాళేనికి చెందిన భూక్యా జనార్దన్‌నాయక్ (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని ఎస్సై జంపాని కుమార్ తెలిపారు. ఈ నెల 15న భూక్యా జనార్దన్‌నాయక్ తన స్వగ్రామమైన సిద్దారెడ్డిపాళెంలో మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా అకస్మాత్తుగా కుక్క అడ్డువచ్చింది. దానిని తప్పించబోయే క్రమంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని బంధువులు చికిత్స నిమిత్తం నెల్లూరులోని నారాయణ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యతో ఉన్నత శిఖరాలు

కావలి (జలదంకి): విద్యతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కావలికి చెందిన వాసవి సెవెన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాదంశెట్టి వేణుగోపాల్ తెలిపారు. కావలి మండలం నడింపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వాసవి సెవెన్ లయన్స్ క్లబ్ నిర్వాహకులు విద్యా సామగ్రిని శుక్రవారం వితరణ చేశారు. పాఠశాలలోని 35 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బలపాలు, జామెంట్రీ బాక్సులు తదితరాలతో పాటు తినబండారాలను అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. హెచ్‌ఎం శానం కృష్ణ, ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు, సంస్థ సభ్యులు పాదర్తి నాగరాజు, పెసల పవన్, శ్రీనివాసులు, పేరూరు శంకర్, రమేష్, రాజా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

ఉదయగిరి రూరల్: రైతుసేవా కేంద్రాల పరిధిలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్, స్టేట్ రిసోర్స్ పర్సన్ మీరాబీ అన్నారు. మండలంలోని గండిపాళెంలో ఉదయగిరి డివిజన్ పరిధిలోని వీపీఏలు, వీహెచ్‌ఏలకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల విచ్చలవిడి వాడకాన్ని తగ్గించేలా చూడాలన్నారు. రసాయన ఎరువులను ఎక్కువగా వాడడం వల్ల భూమి దెబ్బతింటుందన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయ పంటలు, భూస్వాభావాన్ని పరిశీలించారు. ఉదయగిరి డివిజన్ మాస్టర్ ట్రైనర్ రామమోహన్‌రావు, వ్యవసాయాధికారులు రామ్మోహన్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు

కావలి (జలదంకి) : విద్యతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కావలికి చెందిన వాసవి సెవెన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాదంశెట్టి వేణుగోపాల్ తెలిపారు. కావలి మండలం నడింపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వాసవి సెవెన్ లయన్స్ క్లబ్ నిర్వాహకులు విద్యా సామగ్రిని శుక్రవారం వితరణ చేశారు. పాఠశాలలోని 35 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం శానం కృష్ణ, ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు, సంస్థ సభ్యులు పాదర్తి నాగరాజు, పెసల పవన్, శ్రీనివాసులు, పేరూరు శంకర్, రమేష్, రాజా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికల తయారీపై సమీక్ష



ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీపై సీసీలు, వీవీఓలు, సంఘబంధాల అధ్యక్షులతో ఏపీఎం ఎస్ ప్రవంతి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన హక్కులు, అర్హతలు, జీవనోపాధులు, ప్రభుత్వ ఆస్తులు, సామాజిక అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సేవలు గుర్తించి గ్రామసభల్లో చర్చించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సన్మానం



అనుమసముద్రంపేట: చిరమన జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కంచర్ల శేషయ్యనాయుడు మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు అంకయ్యనాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి వారు సేవలను కొనియాడారు. పాఠశాల హెచ్‌ఎం వాణి, విద్యా కమిటీ చైర్మన్ కంచర్ల శ్రీధర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు

కలిగిరి: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కలిగిరి సీఐ పీ వెంకటనారాయణ అన్నారు. కలిగిరిలోని ఆదర్శ పాఠశాలలో కావలి సంయుక్త సేవా సమితి నిర్వాహకుడు సురేంద్ర ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఎన్‌ఆర్‌ఐ నీలిమ అందజేసిన 150 మొక్కలను నాటారు. ఎస్సై ఉమాశంకర్, ఎంఈఓ సురేష్‌బాబు, ప్రిన్సిపల్ అన్నవరం శ్రీను, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచ్ దేవనబోయిన వెంకటసుబ్బయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ కొండారెడ్డి, జేవీవీ నాయకులు మేడం నరసింహారెడ్డి, సంయుక్తసేవా సంస్థ సభ్యులు చంద్రశేఖర్, మంజాన్‌బీ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

దుత్తలూరు : మండలంలోని సోమలరేగడ వద్ద జాతీయరహదారిపై సోమవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయాలపాలయ్యారు. వివరాలు.. ఉదయగిరి–2 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న హజరత్‌మస్తాన్ విధులు ముగించుకుని తన స్వగ్రామమైన వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. సోమలరేగడ సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపైకి ఒక్కసారిగా గేదెలు రావడంతో వాటిని ఢీకొని కిందపడిపోయి తీవ్రగాయాలపాలయ్యాడు.

కారు బోల్తాపడిన ఘటనలో..

ఉదయగిరి పట్టణానికి చెందిన షేక్ మస్తాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో బుచ్చిరెడ్డిపాళెం వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సోమలరేగడ వద్ద ఒక్కసారిగా జాతీయరహదారిపైకి వచ్చిన గేదెలను తప్పించబోయి కారు అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మస్తాన్‌తో పాటు మరో ఇద్దరు కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం వీఆర్వోను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.

ప్రమాదాల నివారణ చర్యలు శూన్యం

సోమలరేగడ సమీపంలో జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు ఎలాంటి నివారణ చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో సోమశిలరేగడ వద్ద జరిగిన ప్రమాదాల్లో పలువురు మత్యువాతపడగా, మరికొందరు క్షతగాత్రులై మంచానికే పరిమితమయ్యారు. జాతీయ రహదారి నిర్మాణం జరిగిన తరువాత రేయింబవళ్లు గేదెలు రోడ్డుపైనే సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా హైవే, పోలీసు అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘ ఎన్నిక



వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ ఎంపీడీఓ గోపీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలాధ్యక్షురాలిగా ఎం విజయమ్మ, ఉపాధ్యక్షులుగా మేడగం సందీప్, పీ పెంచలయ్య, ప్రధాన కార్యదర్శిగా కే శేఖర్, కోశాధికారిగా టీ భారతిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ కేతు శ్రీనివాసరెడ్డి అభినందించారు.

ప్రజా సమస్యల గోడు పట్టేదెవరికి ?

- ప్రజాప్రతినిధుల నుంచి స్పందన కరువు
- అధికారుల తీరు అంతే
- నేడు మండల సర్వసభ్య సమావేశం



నిరుపయోగంగా జీ కొండారెడ్డిపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



మూలనపడిన చెత్తసేకరణ వాహనం

వరికుంటపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుంది. ప్రతి మూడు నెలలకోసారి జరిగే సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేవనెత్తే సమస్యలకు పరిష్కారం కనిపించడం లేదు. దీంతో సర్వసభ్య సమావేశం ఒక ప్రహసనంగా మారింది. తమ సమస్యలను పట్టించుకునే దిక్కులేకపోవడంతో చాలా మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి రావడమే దండగ అంటూ డుమ్మా కొడుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించి, వర్షం పడితే వీధుల్లో నీరు నిల్వ ఉండి దోమలు ప్రబలుతున్నాయి. పలు గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నా అవి సక్రమంగా పని చేయడం లేదు. పనిచేసే చోట కూడా నిబంధనలు పాటించక పోవడంతో ఆ నీరు తాగి పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. పర్యవేక్షించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మండల కార్యాలయాలు వదిలి గ్రామాల్లోకి రావడం లేదు. గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు వేసిన చోట డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఇళ్లలోని మురుగు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అందించిన రిక్షాలు మూలనపడ్డాయి. చెత్త నిర్వహణ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి.మండల పరిషత్‌లో జనరల్ ,15వ ఆర్థిక సంఘం నిధులు పెద్ద మొత్తంలో ఉన్నా వాటిని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధులు సర్పంచ్‌లు అవసరమైన సమస్యలకు వాడకుండా తూతూమంత్రంగా పనులు చేసి స్వాహా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు పనితీరు గాడి తప్పిందనే ఆరోపణలు ఉన్నాయి.సర్వసభ్య సమావేశాలకు మండల స్థాయి అధికారుల అందరూ హాజరుకావాల్సి ఉంది. అయినా సగం శాఖలకు చెందిన అధికారులు డుమ్మా కొడుతున్నారు. ఈ సారి జరిగే సర్వసభ్య సమావేశం ద్వారా అయినా కొన్ని ప్రజాసమస్యలకు పరిష్కారం లభిస్తాయా లేదా అనేది వేచి చూడాల్సిందే.